




బీఆర్ఎస్ ఎదురీత

- జిల్లా బీఆర్ఎస్‌లో నాయకత్వ కొరత
- శ్రేణులకు కొరవడిన దిశా నిర్దేశం
- కేటీఆర్ పర్యటన విజయవంతంతో రెట్టింపైన ఉత్సాహం
- ప్రచారంలో స్పీడ్ పెంచిన కాంగ్రెస్, బీజేపీ పార్టీలు


నిర్మల్, మే 10 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల ప్రచారపర్వంలో బీఆర్ఎస్ పార్టీ తంటాలు పడుతోంది. నాయకత్వ కొరతతో ఆ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం కరువవుతోంది. కేవలం జడ్పీ చైర్మన్ కొరిపెల్లి విజయలక్ష్మి, ఆమె భర్త, మాజీ డీసీసీబీ చైర్మన్ రాంకిషన్‌రెడ్డి, పార్టీ పట్టణాధ్యక్షులు మారుగొండ రాములతో పాటు తదితరులు మాత్రమే పార్టీలో సీనియర్ నేతలుగా ఇప్పటికి మిగిలారు. గత కొద్దిరోజుల నుంచి ఆ పార్టీకి చెందిన మాజీమంత్రితో పాటు చాలా మంది మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నేతలంతా కాంగ్రెస్ పార్టీ లోనూ, బీజేపీ పార్టీలోనూ చేరిపోయారు. రోజురోజుకు కొంతమంది పార్టీ మారడంతో బీఆర్ఎస్ పార్టీ ఒక్కసారిగా డీలా పడిపోయింది. అసెంబ్లీ ఎన్నికల్లో కనిపించిన జోష్ ప్రస్తుతం ఆ పార్టీలో మాయమైపోయింది. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులే కాంగ్రెస్ పార్టీలో చేరిపోవడంతో ప్రస్తుతం ఆ పార్టీని ముందుకు నడిపే నాయకుడే లేకుండాపోయాడు. ముథోల్ నియోజకవర్గంలో రమాదేవి, ఖానాపూర్‌లో జాన్సన్ నాయక్‌లు అంతో ఇంతో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు మాత్రం దీటైన ప్రచారాన్ని బీఆర్ఎస్ పార్టీ నిర్వహించలేకపోతోంది. కేవలం నిర్మల్ జిల్లా కేంద్రంతో పాటు ముథోల్, ఖానాపూర్ నియోజకవర్గ కేంద్రాల్లోని కొన్ని వాహనాల్లో మాత్రమే ప్రచారం నిర్వహిస్తూ ఆ పార్టీ నేతలు చేతులు దులుపుకుంటున్నారు. రెండు రోజుల క్రితం బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి మాజీ ఎమ్మెల్యే జోగు రామన్నతో పాటు పార్టీ అభ్యర్థి ఆత్రం సక్కులు హాజరై ప్రసంగించారు. అయితే ఓ పంక్షన్‌హాల్‌లో జరిగిన ఈ సమావేశానికి పార్టీ కార్యకర్తలు కొంతమంది హాజరు కాగా సమావేశం నిండుగా కనిపించేందుకు సాధారణ జనాన్ని రప్పించినట్లు ప్రచారం జరుగుతోంది. ఇలా అటు నాయకత్వం ఇటు కార్యకర్తల కొరతతో సతమతమవుతున్న బీఆర్ఎస్ పార్టీకి గురువారం నిర్మల్ జిల్లాలో ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు కేటీఆర్ జరిపిన పర్యటన ఊపిరి పోస్తోందని అంటున్నారు. నిర్మల్ రోడ్‌షోకు జనం ఆశించిన సంఖ్యలో హాజరుకావడంతో నేతలు సంబురపడుతున్నారు. ఈ రోడ్ షో సక్సెస్‌పై బీఆర్ఎస్ పార్టీ నేతలు మాట్లాడుతూ కేసీఆర్‌పైనా, బీఆర్ఎస్ పార్టీపైనా ఇప్పటికి జనంలో ఆదరణ తగ్గలేదని నిరూపితమైందని అంటున్నారు.

కేటీఆర్ పర్యటన సక్సెస్‌తో కొత్త ఆశలు

కాగా మొన్నటి అసెంబ్లీ ఎన్నికల కారణంగా డీలా పడిన బీఆర్ఎస్ పార్టీకి ఆ పార్టీ అగ్రనేత కేటీఆర్ నిర్మల్‌లో జరిపిన పర్యటన రెట్టింపు ఉత్సాహాన్ని పెంపొందించిదంటున్నారు. నిర్మల్ రోడ్ షోకు జనం భారీ సంఖ్యలో తరలిరావడం, కేటీఆర్ ప్రసంగాన్ని ఆసక్తిగా వినడమే కాకుండా ఆయన విసిరిన చలోక్తులకు కరతాలధ్వనులతో మద్దతు పలికారు. రేవంత్‌రెడ్డిపైనా, ప్రధానిమోడీపైనా కేటీఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకొని కేటీఆర్ చేసిన విమర్శలకు ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. జనం స్పందన చూసి కేటీఆర్ దాదాపు 45 నిమిషాల పాటుగా ఉత్సాహంతో ప్రసంగించారు. జనస్పందన భారీగా ఉండడంతో కేటీఆర్ సైతం సంబురపడ్డారు. జనం నుంచి తన విమర్శలకు స్పందన లభించడంతో కేటీఆర్ సైతం మెజార్టీపై ధీమా పెంచుకున్నారంటున్నారు. గత కొద్దిరోజుల నుంచి జడ్పీ చైర్‌పర్సన్ కొరిపల్లి విజయలక్ష్మి, మాజీ డీసీసీబీ చైర్మన్ రాం కిషన్‌రెడ్డి, నిర్మల్ పట్టణాధ్యక్షులు మారుగొండ రాము, జాగృతి జిల్లా అధ్యక్షులు చారి, దేవరకోట దేవస్థానం డైరెక్టర్ అనిల్, చంద్రశేఖర్‌గౌడ్, నజీర్ హైమద్‌లతో పాటు తదితరులు ప్రచారం నిర్వహిస్తున్నారు. అయితే వీరందరికి సరియైన దిశానిర్దేశం లేని కారణంగా ప్రచారంలో అనేక ఒడిదొడుకులు ఎదుర్కొన్నారు. ఎట్టకేలకు తమ పార్టీ అగ్రనేత కేటీఆర్ నిర్మల్ పర్యటనకు రావడమే కాకుండా నాయకులు, కేడర్ మధ్య సమన్వయంపై చర్చించి వారందరికి దిశానిర్దేశం చేయడం పార్టీ అభ్యర్థి గెలుపునకు కలిసి రావచ్చని అంటున్నారు.

స్పీడ్ పెంచిన కాంగ్రెస్, బీజేపీలు

ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు తమ స్పీడ్‌ను పెంచాయి. ఈ రెండు పార్టీలు పోటాపోటీగా తమ ఎన్నికల ప్రచారాన్ని కొనసాగిస్తున్నాయి. ఇటు లోక్‌సభ అభ్యర్థులతో పాటు ఆ పార్టీలకు చెందిన సీనియర్ నాయకులు ఉపాధి కార్మికుల వద్దకు వెళుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. ఉపాధి కూలీల వద్ద కూర్చుని వారు తమ పార్టీ మెనిఫెస్టోలను వివరిస్తున్నారు. ప్రస్తుతం ఈ రెండు పార్టీలు ఉపాధి హామీ కూలీలను టార్గెట్‌గా చేసుకొని ఆ దిశగా ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నాయి. అయితే ఈ రెండు పార్టీల దూకుడు ముందు బీఆర్ఎస్ పార్టీ ప్రచారం పెద్దగా ప్రభావం చూపడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



అయితే కేటీఆర్ పర్యటన విజయవంకావడంతో శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు సైతం ఉపాధి కూలీల బాట పట్టాయి. ఉదయం నుంచి పగటి వరకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు వేరు వేరుగా ఉపాధి హామీ కూలీలను కలిసి బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. ఉపాధి హామీ కూలీలు సైతం బీఆర్ఎస్ పార్టీ నేతల మాటలకు స్పందించడంతో ఆ పార్టీ నాయకులు మరింత ఉత్సాహాన్ని కొనసాగించే దిశగా చర్యలు చేపడుతున్నారు.

ఘనంగా అష్టభుజ వేణుగోపాల స్వామి ఆలయ వార్షికోత్సవం



అష్టభుజ వేణుగోపాలస్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

లక్ష్మణచాంద, మే 10 : మండల కేంద్రంలోని అష్టభుజ వేణుగోపాలస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా గత రెండు రోజులుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం నిర్వహించిన స్వామివారి కళ్యాణం కన్నుల పండుగగా జరిగింది. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ఓస రాజేశ్వర్, తాజా మాజీ సర్పంచ్ సురకంటి ముత్యంరెడ్డి, నాయకులు ఈటెల శ్రీనివాస్, గ్రామస్తులు రవికిరణ్, రాజు, తదితరులు ఉన్నారు.

వట్టోలిలో మహాత్మా బసవేశ్వర జయంతి



మహాత్మా బసవేశ్వర స్వామి విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న వీరశైవులు

భైంసా రూరల్, మే 10 : మండలంలోని వట్టోలి గ్రామంలో శ్రీ మహాత్మా బసవేశ్వరస్వామి జయంతిని ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ ఈ సందర్భంగా మాట్లాడుతూ... బసవేశ్వరస్వామి కుల వ్యవస్థను, వర్ణ విభేదాలను, లింగ వివక్షతను వ్యతిరేకించిన అభ్యుదయవాది అన్నారు. ప్రజలను కుల మతాలకు అతీతంగా ఏకం చేశారన్నారు. ఆ మహనీయుడు తన బోధనలతో సమ దృష్టితో ఎందరినో ఆకర్షించి వీరశైవ మతానికి పట్టం కట్టిన బసవేశ్వరుడి ఖ్యాతి ఎల్లలు దాటి తెలుగు రాష్ట్రాల్లో వ్యాప్తి చెందిందన్నారు. ప్రతి ఒక్కరూ మార్గ దర్శకం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'అంజన్న స్వాముల అరెస్టు సరికాదు'

ముథోల్, మే 10 : భైంసాకు వచ్చిన కేటీఆర్ సభలో నిరసన తెలిపిన హనుమాన్ మాలదారులను అరెస్టు చేయడం సరికాదని ముథోల్ మండల బీజేపీ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. శ్రీరాముడి భక్తులైన అంజన్న స్వాములు నిరసన తెలిపితే అరెస్టు చేయడం సరికాదన్నారు. కేటీఆర్ రెచ్చగొట్టే విధంగా మాట్లాడారని ఆరోపించారు. హిందువుల ఆరాధ్య దైవం జై శ్రీరామ్ నినాదంపై కేటీఆర్ కొన్ని సభల్లో వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. హిందూ మనోభావాలను కించపరిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. బీజేపీ గెలుస్తుందన్న భయంతోనే నిరసన తెలిపిన వారిని చిల్లర మాటలు అనడం మంచి పద్ధతి కాదన్నారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో బీజేపీ నాయకులు తాటివార్ రమేష్, కోరి పోతన్న, భూమేష్, పోతన్న, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, తదితరులున్నారు.

ఘనంగా అక్షయ తృతీయ



పెంచికల్‌పాడ్ గ్రామంలో యోగేశ్వర కృషికి మంగళహారతులతో వెళుతున్న మహిళలు

కుంటాల, మే, 10 : కుంటాల మండలంలో శుక్రవారం ప్రజలు అక్షయ తృతీయ కార్యక్రమాన్ని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్వాధ్యాయ యోగేశ్వర కృషి కేంద్రాలలో నూతన వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



కుబీర్ : మండల కేంద్రంతో పాటు మండలంలోని పల్సి, పార్డి (బీ), మాలేగాం, నిగ్వా, సోనారి, తదితర గ్రామాల్లో శుక్రవారం అక్షయ తృతీయ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లోని ఆలయాల్లో దేవతా మూర్తులకు అభిషేకం నిర్వహించారు. నూతన వస్త్రాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. రైతులు వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. పత్తి, సోయాబీన్, కంది విత్తనాలను కొనుగోలు చేశారు. దీంతో విత్తన విక్రయ కేంద్రాలు రైతులతో రద్దీగా మారాయి.

ఘనంగా అక్షయ తృతీయ

ముథోల్, మే 10 : మండల కేంద్రమైన ముథోల్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం ప్రజలు అక్షయ తృతీయ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మరికొందరు శుభ దినం కావడంతో నూతన గృహ నిర్మాణాలకు భూమి పూజ చేశారు. మరికొందరు రైతులు పంట పొలాల్లో భూమి పూజ చేశారు. స్వాధ్యాయ పరివార్ మండలంలోని ఆయా గ్రామాల్లో గల యోగేశ్వర్ కృషిలో భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఒకరికొకరు అక్షయ తృతీయ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

'భైంసా రోడ్ షోలో కేటీఆర్‌పై దాడి హేయమైన చర్య'

ఖానాపూర్, మే 10 : భైంసా రోడ్ షోలో కేటీఆర్‌పై కొంతమంది చేసిన దాడి హేయమైన చర్యగా బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్ అభివర్ణించారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రజాస్వామ్యంలో ప్రచారం చేసుకునే హక్కు ప్రతి రాజకీయ పార్టీకి ఉంటుందన్నారు. ప్రజల వద్దకు వెళ్లి తాము ఏం చేస్తామో చెప్పే ధైర్యం లేనివారే ఇతరులపై దాడులకు తెగబడతారన్నారు. మాజీ మంత్రి కేటీఆర్‌పై కోడిగుడ్లు, రాళ్లు, ఉల్లిగడ్డలు, టమాటాలతో దాడులు చేయడాన్ని బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ శాఖ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రాథోడ్ రామునాయక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కల్వకుంట్ల నారాయణ, తదితరులున్నారు.

దళితుల మనోభావాలను దెబ్బతీసిన విలేకరిపై కేసు నమోదు

సారంగాపూర్, మే 10 : మండల కేంద్రానికి చెందిన ఓ దినపత్రిక విలేకరి దళితుల మనోభావాలను దెబ్బతీయడంతో కేసునమోదు చేసినట్లు ఎస్సై చంద్ర మోహన్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీకి చెందిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు అద్దంకి దయాకర్‌పై అసభ్యంగా బూతులతో కూడినటువంటి వీడియోను యూట్యూబ్ నుండి సేకరించి వాట్సాప్ గ్రూప్‌లో పెట్టడంతో దళి తుల మనోభావాలు దెబ్బతీశాయని, చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్ కల్చరల్, మే 10 : ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. కొనుగోళ్లు, అకాల వర్షాల సందర్భంగా తీసుకోవలసిన చర్యలను శుక్రవారం చర్చించారు. ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం వెంటనే మిల్లులకు తరలించాలని, నిర్లక్ష్యం చేసే వారిపై చర్యలుంటాయన్నారు. క్షేత్రస్థాయిలో కేంద్రాలు సందర్శించి నివేదికలు అందించాలన్నారు. అధికారులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట నిఘా ఉంచాలి

ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద నిరంతరం పటిష్ట నిఘా ఉంచాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. శుక్రవారం పాలిటెక్నిక్ కళాశాలలో నుంచి ఖానాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ ఈవీఎంలు కలెక్టరేట్ వద్ద గల ఈవీఎంల గోదాంకు పోలీసు బందోబస్తు నడుమ తరలించారు. అక్కడ విధులు నిర్వహించే సిబ్బంది ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. రాజకీయ పార్టీ నాయకుల సమక్షంలో ఈవీఎంలను తరలించారు. అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదు

- కేటీఆర్ రోడ్ షో ఘటనపై నాలుగు కేసులు నమోదు
- 23 మంది నిందితుల అరెస్టు రిమాండ్
- జిల్లా ఎస్పీ జానకీ షర్మిల వెల్లడి



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ జానకీ షర్మిల



బందోబస్తు నిర్వహిస్తున్న ఇండో టిబెటన్ బార్డర్ పోలీసు బలగాలు

భైంసా, మే 10: ఉద్రిక్తతలకు దారితీసే విధంగా వ్యవహరిస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారు ఎంతటి వారైనా ఉపేక్షించబోమని జిల్లా ఎస్పీ జానకీ షర్మిల వెల్లడించారు. శుక్రవారం భైంసా పట్టణ పోలీసు స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రశాంత వాతవరణానికి భంగం వాటిల్లితే సహించేది లేదన్నారు. అలాంటి వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గురువారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రోడ్ షో సందర్భంగా జరిగిన వివిధ ఘటనలపై భైంసా పట్టణ పోలీసు స్టేషన్‌లో నాలుగు కేసులు నమోదు చేసామన్నారు. ఇందులో ఎన్నికల మోడ్ ఆఫ్ కండక్ట్ కేసు కూడ ఒకటి ఉందన్నారు. సంబంధిత కేసులు శుక్రవారం 23 మంది నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని వివరించారు. ప్రస్తుతం భైంసాలో సాధారణ పరిస్థితులు కొనసాగుతున్నాయన్నారు. అంతటా ప్రశాంత వాతావరణం నెలకొని ఉందన్నారు. రూమర్స్‌ను ఎవరు పట్టించుకోవదని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట భద్రతాచర్యలు చేపట్టామని పెర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పోలీసుశాఖకు సహకరించి శాంతియుత వాతావరణానికి తోడ్పాటు నివ్వాలని విజ్ఞప్తి చేశారు.

భారీ పోలీసు బందోబస్తు

గురువారం కేటీఆర్ రోడ్ షో సందర్భంగా చోటు చేసుకున్న ఘటనలను దృష్టిలో పెట్టుకొని భైంసా పట్టణ పరిధిలో పోలీసుశాఖ శుక్రవారం భారీ బందోబస్తు చర్యలకు ఉపక్రమించింది. ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ నేతృత్వంలో టౌన్ సీఐ రాజారెడ్డి పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఉండేందుకు గాను పకడ్బందీ భద్రతా చర్యలు చేపట్టారు. పట్టణాన్ని నాలుగు జోన్లుగా విభజించి బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రధాన కూడలీలు,వివాదాస్పద, సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసు పికెట్లు ఏర్పాటు చేశారు. 6 బ్లూకోట్ బృందాలు నిత్యం పట్టణ పరిధిలో పర్యటిస్తూ బందోబస్తు పర్యవేక్షిస్తున్నారు. రెండు ప్లాటూన్ల ఇండో టిబెటన్ బార్డర్ పోలీసు బలగాలు బందోబస్తు కోసం తరలివచ్చాయి. సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు స్టేషన్ల సీఐలు,ఎస్ఐలు భద్రతా చర్యల్లో పాల్గొంటున్నారు.

అధికారులతో ఎస్పీ సమీక్ష

శుక్రవారం జిల్లా ఎస్పీ జానకీ షర్మిల భైంసా పట్టణ పోలీసు స్టేషన్‌లో శాంతి భద్రతలు, కేటీఆర్ రోడ్ షో ఘటనలు, కేసులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. పట్టణ పోలీసు అధికారులతో పాటు బందోబస్తులో పాల్గొంటున్న పోలీసు అధికారులు సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఘటనకు గల కారణాలు, ఫిర్యాదు, కేసులు,అరెస్టులపై వివరాలు తెలుసుకున్న ఎస్పీ జానకీ షర్మిల తదుపరి చర్యలపై దిశ, నిర్దేశం చేశారు. అనంతరం పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు.

సంక్షిప్త సమాచారం

జిల్లా కేంద్రంలో కత్తిపోట్లు

- ముగ్గురు యువకుల మధ్య ఘర్షణ
- ఒకరి మృతి.. మరొకరి పరిస్థితి విషమం



జిశాన్ (ఫైల్)

నిర్మల్, మే 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకేంద్రంలోని మినీట్యాంక్ బండ్ వద్ద దారుణ హత్య చోటు చేసు కుంది. వ్యక్తిగత కారణాలతో ముగ్గురు యువకులు గొడవ పడడంతో చివరకు అది కత్తిపోట్లకు దారితీసింది. ఈ ముగ్గురి మధ్య మాట మాట పెరగడంతో సుమీర్ అనే యువకుడు చిక్కడపల్లికి చెందిన జిశాన్(23), బుధవార్‌పేట్‌కు చెందిన మతిన్ అనే ఇద్దరు యువకులపై ఒక్కసారిగా కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో జిశాన్ అక్కడికక్కడే మృతి చెందగా మతిన్ తీవ్ర గాయాలపాలయ్యాడు. ఇది గమనించిన స్థానికులు మతిన్‌ను వెంటనే జిల్లా ఆసుపత్రికి తరలించారు. కాగా మతిన్ పరిస్థితి విషమించడంతో ఆయనను హైదరాబాద్ ఆసుపత్రికి తరలించారు. కత్తితో దాడి చేసిన సుమీర్ పరారయ్యాడు. విషయాన్ని తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ జరుపుతున్నారు.

దస్తూరాబాద్‌లో ద్విచక్ర వాహనం చోరీ

దస్తూరాబాద్ రూరల్, మే 10 : మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మండల కేంద్రానికి చెందిన మారవేణి నవీన్‌కు చెందిన హెచ్‌ఎఫ్ డీలక్స్ ఏపీ 01 ఏహెచ్ 7019 నెంబర్ గల ఇంటి ముందు ఉన్న ద్విచక్ర వాహనాన్ని రాత్రి సమయంలో దొంగిలించారు. ఉదయం లేచేసరికి బైక్ లేకపోవడం, చుట్టుపక్కల వెతికిన దొరకకపోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యాసిర్ అరాఫత్ తెలిపారు.

నేటి నుంచి మూడు రోజుల పాటు మద్యం షాపుల మూసివేత



వైన్స్‌షాపులోని మద్యం బాటిళ్లు

భైంసా, మే 10 : లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకొని శనివారం నుంచి మూడు రోజుల పాటు మద్యం షాపులు మూతపడనున్నాయి. సంబంధిత విషయంలో ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు ఇప్పటికే ఉత్తర్వులను జారీ చేశారు. శనివారం సాయంత్రం 5 గంటల నుంచి లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ జరిగే సోమవారం సాయంత్రం 6 గంటల వరకు మద్యం షాపులు మూసి వేయనున్నారు. సోమవారం పోలింగ్ ప్రక్రియ ఆద్యంతం ముగిసిన అనంతరం మద్యం షాపులు తెరుచుకోనున్నాయి.

జోరుగా కొనసాగుతున్న ఇచ్చోడ ప్రధాన రహదారి పనులు

● ఎన్నికల అనంతరం ఇలాగే సాగేనా ?

ఇచ్చోడ, మే 10: ఏన్నోఏళ్లుగా ఇబ్బంది పడుతున్న ప్రజల కోరిక మేరకు ప్రారంభమైన ఇచ్చోడ ప్రధాన రహదారి పనులు జోరుగా సాగుతున్నాయి. నెల రోజుల క్రితమే పనులు మొదలైనప్పటికి వేగంగా పనులు సాగడంతో చాలా వరకు పనులు పూర్తయ్యాయి. అన్ని పార్టీల నేతలు ఈ రహదారి దృష్టిసారించడంతో పనులు వేగంగా సాగుతున్నాయి. ఎన్నికల నేపథ్యంలో అన్ని పార్టీల నాయకులు ఒత్తిడి చేయడంతో పనులు ప్రారంభమయ్యాయి. నిర్మాణ పనుల పట్ల స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కానీ రానున్న లోక్‌సభ ఎన్నికల అనంతరం కూడా పనులు ఇలాగే సాగాలని కోరుతున్నారు. బిల్లుల చెల్లింపులో జాప్యం జరగకపోతే పనులు వేగంగానే పూర్తవుతాయని అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఖానాపూర్‌లో మరోసారి అకాలవర్షం

● మార్కెట్ యార్డ్‌లో తడిసి ముద్దయిన ధాన్యం ● ఆరిన ధాన్యం తడిసిపోవడంతో ఆవేదనతో రోడ్డెక్కిన అన్నదాత ● తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఖానాపూర్‌లో రాస్తారోకో ● ఖానాపూర్ రహదారిపై సుమారు గంటకు పైగా నిలిచిన రాకపోకలు


ధాన్యం మధ్యలో నిలిచిన వర్షపు నీరు


శుక్రవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి నీట మునిగిన ధాన్యాన్ని కుప్ప చేస్తున్న రైతు

ఖానాపూర్, మే 10 : వరుసగా రెండో రోజు ఖానాపూర్‌లో అకాల వర్షం కురవడం అన్నదాతను కలవరపెడుతుంది. మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం భారీ ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో ఖానాపూర్ మార్కెట్ యార్డ్‌లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యమంతా తడిసి ముద్దయింది. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను గత కొద్ది రోజులుగా కొనుగోలు కేంద్రంలో ఆరబెట్టుకొని విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న సమయంలో వరుసగా రెండు రోజులు కురిసిన వర్షాలకు ధాన్యం తడిసిపోవడంతో ఆవేదనతో అన్నదాత రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితి తలెత్తింది. తడిసిన ధాన్యాన్ని బేషరతుగా కొనుగోలు చేయాలని ఖానాపూర్ తర్లపాడ్ రహదారిపై రైతులు రాస్తారోకో నిర్వహించారు. సుమారు గంటకు పైగా రైతులు రాస్తారోకో నిర్వహించడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతుండడంతో ఘటన స్థలానికి చేరుకున్న ఖానాపూర్ ఎస్సై లింబాద్రి కొమరం భీమ్ చౌరస్తా మీదుగా వాహనాలను దారి మళ్లించారు. అనంతరం రైతులను సముదాయించేందుకు ప్రయత్నించినప్పటికీ వారు వినకపోవడంతో జిల్లా ఉన్నతాధికారులతో రైతులకు ఫోన్ ద్వారా మాట్లాడించారు. ధాన్యం కొనుగోలులో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతామని ఉన్నతాధికారులు హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ ఆందోళనలో ఖానాపూర్, ఎక్బాల్‌పూర్, తర్లపాడ్, పాత తర్లపాడ్ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

దస్తూరాబాద్ మండలంలో గాలివాన బీభత్సం

విరిగిన చెట్లు.. తడిసిన ధాన్యం

దస్తూరాబాద్ రూరల్, మే 10 : శుక్రవారం మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. దీంతో వరి కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యం తడిసి ముద్దయింది. రైతులు తమ ధాన్యాన్ని కాపాడుకునేందుకు నానా తంటాలు పడ్డారు. బలమైన ఈదురు గాలులు వీయడంతో మండల కేంద్రంలోని కూచన్‌పెల్లి సురేష్‌కు చెందిన ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. దీంతో కుటుంబికులు బిక్కుబిక్కుమంటూ గడిపారు. ఇంటిలోని సామాన్లు పూర్తిగా తడిసిపోయాయి. చాలా గ్రామాల్లో మామిడికాయలు రాలిపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. మున్యాల్ గ్రామంలో ప్రధాన రహదారిపై చెట్లు విరిగి పడ్డాయి. పారిశుద్ధ్య కార్మికులు చెట్లను తొలగించి, రాకపోకలను పునరుద్ధరించారు. ఈదురు గాలుల బీభత్సంతో మండల కేంద్రంలో కరెంట్ స్తంభం విరిగిపోయి, విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పరిశీలిస్తూ మరమ్మతులు చేపట్టి విద్యుత్ పునరుద్ధరించారు.


రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు


దస్తూరాబాద్ మండల కేంద్రంలో తడిసిన వరి ధాన్యం

హనుమాన్ దీక్షదారుల అక్రమ అరెస్టులు అపకపోతే ఆందోళనలు తీవ్రతరం


సమావేశంలో పాల్గొన్న బీజేపీ ప్రతినిధులు

భైంసా, మే 10 : కేటీఆర్ రోడ్‌షో సందర్భంగా చోటు చేసుకున్న ఘటనలపై హనుమాన్ దీక్షదారుల అక్రమ అరెస్టులు ఆపకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవి పాండే, పట్టణ కమిటీ అధ్యక్షుడు ఎనుపోతుల మల్లేశ్వర్, ముథోల్ అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ సుమన్‌లు వెల్లడించారు. శుక్రవారం భైంసాలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. గతంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శ్రీరామునిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ గురువారం భైంసాలో హనుమాన్ దీక్షదారులు శాంతియుత నిరసన ప్రదర్శనలు చేపట్టారని పేర్కొన్నారు. ఈ సందర్భంలో కేటీఆర్ మరోమారు హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా, రెచ్చగొట్టేలా మాట్లాడటమే కాకుండా పోలీసులపై సైతం అనుచిత వ్యాఖ్యలు చేసారని ఆరోపించారు. అయితే పోలీసులు హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడిన కేటీఆర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోకుండా హనుమాన్ దీక్షదారులపై అక్రమంగా కేసులు నమోదు చేస్తూ అరెస్టులకు పాల్పడుతున్నారని విమర్శించారు. అర్ధరాత్రి వేళలో ఆలయాలకు వెళ్లి అక్కడ మాలదారణలోనున్న హనుమాన్ దీక్షదారులను భయభ్రాంతులకు గురిచేస్తూ పోలీసుస్టేషన్‌కు తరలించుకపోవడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. పోలీసులు ఇకనైనా హనుమాన్ దీక్షదారుల అక్రమ అరెస్టులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీజేపీ ఆద్వర్యంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని వెల్లడంచారు. ఇందులో మున్సిపల్ కౌన్సిలర్ దశరథ్, బీజేపీ పట్టణ కమిటీ మాజీ అధ్యక్షులు బాలాజీ సూత్రావే, జిల్లా ప్రతినిధి రావుల పోశెట్టిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన నిర్మల్ జిల్లా వ్యవసాయ విస్తరణ అధికారి

నర్సాపూర్(జి), మే 10 : మండలంలోని డొంగుర్‌గాం, చాక్‌పల్లి కొనుగోలు కేంద్రాలను జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. ఈ సంధర్బంగా నిర్వాహకునికి పలు సూచనలు చేశారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా వెంటవెంటనే తూకం చేయాలన్నారు. రైతులకు నీటి వసతి, గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాలన్నారు. దాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్‌మిల్లులకు పంపించాలన్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ లారీల కొరతతో దాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు తప్పడం లేదని అధికారులకు సమస్యను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల విస్తరణ అధికారులు భాగ్యలక్ష్మి, రమ్య నిర్వాహకుడు జంగిపెల్లి సంతోష్, గొంద్ర సంతోష్ , రైతులు పాల్గొన్నారు.

అంబలి పంపిణీ, చలివేంద్రం ప్రారంభం

గుడిహత్నూర్, మే 10: మండల కేంద్రంలోని డీఎస్ టీ పీసీఎల్ సంస్థ ప్రక్కన ఆదివాసీ సేవా మండల కమిటీ ఆధ్వర్యంలో ఉచిత అంబలి పంపిణీ మరియు చలి వేంద్రాన్ని శుక్రవారం ఆదివాసీ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కోవ దౌలత్ రావు మొకాశి, ప్రముఖ వ్యాపారవేత్త కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఏలేటి అశ్వినిరెడ్డి రిబ్బన్‌కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రజల సౌకర్యార్థం చలి వేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రోజు రోజుకు ఎండల తీవ్రత పేరుగుతున్నందున చలి వేంద్రాన్ని ఉపయోగించుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సేన జిల్లా అధ్యక్షుడు రాయిసిడం జంగు పటేల్, ఆదివాసీ సేన రాష్ట్ర నాయకులు, పేందోర్ విశ్వనాథ్ ,తోడషం భూమ పటేల్, ఆదివాసి సేన మండల అధ్యక్షులు సేడ్మకి భీంరావ్, తోషం ఎంపీటీసీ సాగర్ ఖాన్, ఆదివాసి సేన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ చెట్లను తొలగిస్తున్న రైతులు

● మూడేళ్లయినా కాత లేదు పూత లేదు
● అధికారుల పర్యవేక్షణ లోపమా.. లేక సబ్సిడీ రాక నిరాశ


నిన్న పంట పొలంలో పచ్చగా కనిపించిన ఆయిల్ ఫామ్ చెట్లు


నేడు చెట్లను తొలగించిన దృశ్యం

తాంసి, మే 10: ఆయిల్ ఫామ్ సాగువిస్తీర్ణాన్ని పెంచేందు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశ్వప్రయత్నం చేస్తున్నాయి. ఇందులో భాగంగా సాగుచేసే ప్రతిరైతుకు సబ్సిడీ ఇచ్చేందుకు ముందుకు వచ్చింది. అయితే తాంసి మండలంలో సుమారు 200 ఎకరాలలో ఆయిల్‌ఫామ్ చెట్లను పెంచుతున్నారు. అయితే చెట్లు ఏపుగా పేరగకనో.. లేక ఇంకా సబ్సిడీ రాకనో తెలియదు గాని కొంత మంది రైతులు పెరిగిన చెట్లను శనివారం సాయంత్రం సంబంధిత రైతు తొలగించి వేశాడు. మూడేళ్ళ పాటు కంటికి రెప్పలా కాపాడుకున్న చెట్లను గంటవ్యవధిలోనే తొలగించడంతో వచ్చిపోయే వారు ఆశ్చర్యానికి గురయ్యారు. ఇదేమిటి.. ఇంత పచ్చగా ఉన్న పంటపొలాన్ని బీడుగా మార్చాడు అంటూ చర్చించుకున్నారు. అసలు సంబంధిత రైతుకు సబ్సిడీ రాకపోవడమే ప్రధాన కారణమా... లేక అధికారుల పర్యవేక్షణ లోపమా తెలియదు. మరో ఇద్దరు రైతులు కూడా తొలగించేందుకు సన్నాలు చేసినట్లు తెలిసింది. మొత్తం మీద ఆయిల్‌పామ్ రైతులకు గడ్డు కాలమే అని చెప్పవచ్చు.

మాజీ మంత్రి కేటీఆర్‌పై దాడి బీజేపీ కాంగ్రెస్ నాయకుల కుట్ర

● గులాబీ దళం తలుచుకుంటే గ్రామాల్లో తిరగలేదు
● బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

తలమడుగు, మే 10: పోరాడి తెలంగాణ సాధించిన బీఆర్ఎస్ పార్టీకి రోజురోజుకు ప్రజల్లో ఆదరణ పెరగడంతో దాన్నిజీర్ణించుకోలేని బీజేపీ కాంగ్రెస్ నాయకులు మాజీ మంత్రి కేటీఆర్‌పై దాడి చేయడం సిగ్గుచేటు అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం కజ్జర్ల గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిర్మల్ జిల్లా భైంసాలో మాజీ మంత్రి టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై దాడి హేయమైన చర్య అన్నారు. సర్వేల ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో 12 ఎంపీ స్థానాలు టీఆర్ఎస్ పార్టీ గెలుస్తుంది అన్నారు. ప్రజల్లో టీఆర్ఎస్ పార్టీకి ఆదరణ చూసి ఇలా దాడులు చేయడం సమంజసం కాదన్నారు. గులాబీదళం తలుచుకంటే బీజేపీ కాంగ్రెస్ నాయకులు తిరగలేరన్నారు. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి రానుందని కార్యకర్తలు అధైర్యపడవద్దు అన్నారు. ఇందులో మండల కన్వీనర్ తోట వెంకటేశ్, టీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు కేదరేశ్వరరెడ్డి, అబ్దుల్లా, కిరణ్‌కుమార్, పీఎస్‌ఏ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మగ్గిడిప్రకాష్ తదతరులు పాల్గొన్నారు.

పెన్షన్‌కోసం ఇబ్బంది పడుతున్న వృద్ధుడు

బోథ్, మే 10 : వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పెన్షన్ల కోసం లబ్ధిదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. గత రెండు రోజుల నుంచి అర్హులైన వారికి పెన్షన్లు పంపిణీ ప్రారంభం కావడంతో మండల కేంద్రంలోని పోస్టాఫీసు వద్ద వివిధ గ్రామాలకు చెందిన వారితో పాటు మండల కేంద్రానికి చెందిన లబ్ధిదారులు భారీసంఖ్యలో తరలివచ్చారు. అయితే పెన్షన్ల పంపిణీ జరుగుతుండగా వికలాంగులు వృద్ధులు. గర్భిణీ, స్త్రీలు పెన్షన్ల కోసం ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని వాపోయారు.


మాట్లాడుతున్న ఆదిలాబాద్ ఎస్పీ గౌస్‌ఆలం


పాల్గొన్న శిక్షణ కానిస్టేబుల్‌లు

విధులను సక్రమంగా నిర్వర్తించాలి

● ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం ● శిక్షణ కానిస్టేబుళ్లు, కేంద్ర బలగాలకు లోక్‌సభ ఎన్నికల విధుల పై అవగాహన

ఆదిలాబాద్ అర్బన్, మే 10: దేశవ్యాప్తంగా ఎన్నికల నేపథ్యంలో తెలంగాణలో నాల్గవ విడతలో భాగంగా మే 13న పోలింగ్ నిర్వహించనున్న సందర్భంగా జిల్లావ్యాప్తంగా ఎన్నికల విధులను నిర్వహించనున్న నూతన శిక్షణ కానిస్టేబుల్స్, కేంద్ర బలగాలకు జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం ఐపీఎస్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పోలీసు శిక్షణ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పాల్గొని సిబ్బందికి పోలింగ్ స్టేషన్లవద్ద, ఎన్నికల నిర్వహణ పట్ల, జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 87 రూట్లు వాటిలో చేయాల్సిన విధుల పట్ల, మొబైల్ పార్టీల, పోలింగ్ సమయం పట్ల వివిధ అంశాలతో కూడిన పూర్తి అవగాహనను సిబ్బందికి శిక్షణ ద్వారా అందించడం జరిగిందని తెలిపారు. ఏ ఏ విధులలో సిబ్బంది చేయవల్సిన సూచనలతో కూడిన ఒక సంచికను ప్రతీ ఒక్క సిబ్బందికి అందజేశారు. సిబ్బందికి ఎటువంటి అనుమానాలు ఉన్న పుస్తకంలో చూసి నివృత్తి చేసుకోవాలని తెలిపారు. అలాగే రాష్ట్రంలో ఎన్నికల సంఘం నిర్ణయించిన సమయం ప్రకారం మే 13న ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ ఉంటుందని తెలిపారు. పోలింగ్ స్టేషన్ల వద్ద ప్రజలకు వంద మీటర్ల పరిధిలో గూమి గూడకుండా, ప్రజలు క్రమబద్ధీకరణతో క్యూలైన్లను పాటిస్తూ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా చూడాలని సూచించారు. పోలింగ్ బూత్ లోపలికి మొబైల్‌ఫోన్లను, మంట కలిగించే వస్తువులకు అనుమతి లేదని ప్రజలకు తెలపాలని సూచించారు. పోలింగ్ సెంటర్ లోపలికి ఓటర్ స్లిప్పు, ఐడీ కార్డులు వాటిని అనుమతించాలని, సిబ్బంది ఎండలు మండుతున్న నేపథ్యంలో ఓఆర్ఎస్, మంచినీటిని ఎక్కువగా సేవించి తమ ఆరోగ్యాలని కాపాడుకోవాలన్నారు. ఎటువంటి అత్యవసర సమయంలోనైనా మీకు త్వరగా అందుబాటులో ఉండే రూట్ మొబైల్ పార్టీలను సంప్రదించాలని లేని పక్షంలో స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ప్రతీఒక్క సిబ్బంది వద్ద తాము నిర్వహించే పోలింగ్ స్టేషన్ పరిధిలో వచ్చే ఉన్నతాధికారుల మొబైల్ నెంబర్లను ముందుగానే తీసుకోవాలన్నారు. చిరగా పోలీసుల ముఖ్య బాధ్యత ఈవీఎంలను సురక్షితంగా కాపాడడం అని గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా జరిగిన సంఘటనలను సిబ్బందికి తెలిపి, అలాంటి సంఘటనలు పునరావృతంకాకుండా చూడాలన్నారు. రూట్ మొబైల్స్‌లో సిబ్బంది రిసెప్షన్ సెంటర్కు వచ్చేంత వరకు అప్రమత్తంగా ఉంటూ తమ విధులను పూర్తిగా నిర్వర్తించాలని, అదే విధంగా కేంద్ర బలగాలైనా సీఏపీఎఫ్ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి జిల్లావ్యాప్తంగా ఉన్న క్రిటికల్, మావోయిస్టు ప్రభావిత పోలింగ్ స్టేషన్‌ల వద్ద అప్రమత్తతతో విధులు నిర్వర్తించాలని తెలిపారు. పోలింగ్ పూర్తయిన తర్వాత స్ట్రాంగ్ రూముల వద్ద భద్రతలో కేంద్ర బలగాలను వినియోగించనున్నట్లు, భద్రతలో వారి బాధ్యత కీలకంగా ఉండబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు సి.సమైజాన్‌రావు, బి.సురేంద్రరావు, డీఎస్పీలు బి.ప్రకాష్, ఎల్.జీవన్ రెడ్డి, పోతారం శ్రీనివాస్, సీఐ కె.సత్యనారాయణ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి : ఎస్పీ

ఉట్నూర్, మే 10: ఈ నెల13న జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌లో ప్రజలందరు స్వచ్ఛందంగా పాల్గొని ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ గౌస్‌ఆలం అన్నారు. శుక్రవారం ఉట్నూర్ పట్టణంలో పోలీసులు నిర్వహించిన కవాతులో పాల్గొని మాట్లాడారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవడానికి మండల కేంద్రాలలో కవాతులు నిర్వహిస్తున్నామని అన్నారు. ఎవరూ ఎలాంటి ఇబ్బందులకు గురికావద్దని అన్నారు. నిర్భయంగా ప్రతి ఒక్కరు పోలింగ్‌లో పాల్గొని ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రధాన వీధుల గుండా పోలీసులతో కవాతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నాగేందర్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గండికోట మొగిలి, ఎస్సైలు మనోహర్, తదితరులు పాల్గొన్నారు.


ఇంద్రవెల్లిలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ఇంద్రవెల్లి: ఈనెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లందరూ తమ ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పలు వీధుల్లో వంద మంది శిక్షణ కానిస్టేబుల్ లతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రలోభాలకు గురికాకుండా ఓటు వేయాలని కోరారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగించాలని చూసే ఊరుకునేది లేదని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ సీఐ మొగిలి, స్థానిక ఎస్సై దుబ్బాక సునీల్, తదితరులున్నారు.


పాల్గొన్న బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

ఘనంగా బాబా ఆలయ వార్షికోత్సవం

నేరడిగొండ, మే 10: మండలంలోని వడూర్ గ్రామంలో ఉన్న సాయి బాబా వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ పాల్గొన్నారు. ప్రతినిత్యం ఆలయాల్లో పూజలు చేయడం ద్వారా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంటుందని ఆయన అన్నారు. వీరితో పాటు ఎంపీపీ రాథోడ్‌సజన్, మండల నాయకులు కార్యకర్తలు, అభిమానులు తదితరులుపాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎంసెట్ ప్రవేశ పరీక్ష

మావల, మే 10: ఇంజనీరింగ్ కోర్సు ప్రవేశాల కోసం నిర్వహించిన ఎంసెట్ ప్రవేశ పరీక్ష మొదటి రోజు ప్రశంతంగా కొనసాగింది. శుక్రవారం నిర్వహించిన ఎంసెట్ పరీక్షకు మొదటి సెషన్‌లో 75 విద్యార్థులకు 74 మంది, మధ్యాహ్నం సెషన్‌లో 100 మంది విద్యార్థులకు 95 మంది హాజరైనట్లు సెంటర్ చీఫ్ సూపరిడెంట్ పున్నారావు తెలిపారు.

మెగా వైద్య శిబిరానికి స్పందన

ఉట్నూర్, మే 10: ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదేశాల మేరకు మండలంలోని సాలెవాడలో శుక్రవారం షాంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఈ సందర్భంగా 113 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరాన్ని ఏజెన్సీ వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.కుడిమెత మనోహర్ తనిఖీ చేసి పరిశీలించారు. ఈ శిబిరంలో డాక్టర్లు రాథోడ్‌సందీప్, ఇఫత్, హెచ్‌ఈఓ తులసీదాస్, తదితరులున్నారు.

ప్రారంభమైన విత్తనాల అమ్మకం

బోథ్, మే 10 : అక్షయ తృతీయను పురస్కరించుకొని మండలంలో వ్యాపారులు విత్తన విక్రయాలను ప్రారంభించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పలువురు వ్యాపారులు పత్తి విత్తనాలను విక్రయించారు. రైతులు సైతం అక్షయ తృతీయ రోజున విత్తనాలు కొనుగోలు చేస్తే పంట దిగుబడి వస్తుందన్న నమ్మకంతో విత్తనాలు కోనుగోలు చేశారు.

అర్లి(టి)లో వ్యవసాయ పనులు..

భీంపూర్: మండల అర్లి(టి) గ్రామంలో స్వధాయి భక్తులు శుక్రవారం అక్షయ తృతీయ సందర్భంగా సామూహిన వ్యవసాయ పనులు ప్రారంభించారు గత 9 ఏళ్లుగా ఈ గ్రామంలోని స్వధాయి యోగేశ్వర కృషి రేరిట ఇలా భక్తులంతా ఒక్కటై ఎకరం భూమిలో పంట వేస్తున్నారు పంట వచ్చిన తరువాత వచ్చినడబ్బుల నుంచి నలపై శాతం ముబాయి ప్రధాన కేంద్రంగా ఉన్న పాండురంగ శాస్త్రీ అటవేలెన్మస్తాన్‌కు, మిగితా నాలపై శాతం భూమి కౌలు కు ఇచ్చిన భక్తునికి మిగతావి స్థానిక స్వాదాయి కార్యక్రమాలకు వినియోగిస్తారు. స్వదాయి సాయూహిక వ్యవసాయం అనేది జిల్లాలో ఉన్న 16గ్రామాల్లో అర్లి(టి) ఒకటని పేర్కొన్నారు.


అర్లి(టి)లో వ్యవసాయ పనులను ప్రారంభిస్తున్న భక్తులు

ఉట్నూర్‌లో గాలివాన బీభత్సం

● పలుచోట్ల కూలిన చెట్లు.. వాహన రాకపోకలకు అంతరాయం ● దందుతండాలో ఇళ్ల పైనుంచి లేచిన పైకప్పులు

ఉట్నూర్, మే 10: ఉట్నూర్ మండలంలో శుక్రవారం సాయంత్రం కురిసిన గాలివాన బీభత్సం సృష్టించింది. ఉట్నూర్ పట్టణంలోని ఆదిలాబాద్‌ప్రధాన రహదారి పై తెలంగాణచౌక్ సమీపంలో రెండు చెట్లు రోడ్డుపై పడిపోవడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డాయి. అదే విధంగా మండలంలోని షాంపూర్ పంచాయతీ పరిధిలో ఉన్న గోదారిగూడ సమీపంలో ఆదిలాబాద్ ఉట్నూర్ ప్రధాన రహదారి పై చెట్టు కూలిపోవడంతో ట్రాఫిక్ నిలిచి పోయింది. గ్రామీణ ప్రాంతాల ప్రజలు వెంటనే ప్రయాణికులతో కలిసి గొడ్డల్లతో చెట్టును నరికి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. మండలంలోని దందుతాండలో ఈదురు గాలులతో ఇళ్లపై ఉన్న పైకప్పులు రేకులు లేచి పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఇండ్లలోని వంట సామాగ్రితో పాటు వస్తువులు తడిచి ముద్దయ్యాయని ప్రజలు తెలిపారు. ఇండ్ల పైన రేకులన్ని గాలికి కొట్టుకుపోయి దూరంగా పంట చేలలో పడిపోవడంతో వాన తగ్గాక ప్రజలు తెచ్చుకొని ఇండ్ల పై కప్పులను సర్దుకోవడం మొదలు పెట్టారు. ఉట్నూర్ పట్టణంలోని ప్రధాన రహదారి పై ఉన్న విద్యుత్ తీగల పై చెట్ల కొమ్మలు పడక పోవడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ఇదేకాకుండా మండలంలోని ఏందా ఉదయ నాయక్ తండాలో కూడా పందిర్ల పై ఉన్న పైకప్పులు ఎగిరిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.


దందుతండాలో ఇళ్ల పైకప్పులు లేచిపోయిన దృశ్యం


ఉట్నూర్‌లో ప్రధాన రోడ్డుపై కూలిన చెట్టు, తెగిన విద్యుత్ తీగలు


గోదారిగూడా వద్ద రహదారిపై కూలిన చెట్టు


పడిపోయిన విద్యుత్ లైన్‌ను పరిశీలిస్తున్న ఎస్‌ఈ

● విద్యుత్ లైన్లను పరిశీలించిన ఎస్ఈ

ఉట్నూర్: మండల కేంద్రంలోని తెలంగాణచౌక్ సమీపంలో ఉట్నూర్ ఆదిలాబాద్ ప్రధాని రహదారి పై శుక్రవారం వీచిన ఈదురుగాలులతో కరెంట్ స్థంబం విరిగి పడిపోవడంతో పాటు విద్యుత్‌తీగలు పడిపోవడంతో జిల్లా ఎస్ఈ జేహర్‌చౌహాన్ పరిశీలించారు.అంతకు ముందు తొలిసారిగా స్థానికంగా ఉన్న విద్యుత్ కార్యాలయానికి రావడంతో విద్యుత్ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యుత్ లైన్లు పడిపోయాయని తెలియడంతో స్వయంగా పరిశీలించి విరిగి పడిన కరెంట్ స్థంబాన్ని తొలగించి కొత్త కరెంట్ పోల్‌ని వేయించి విద్యుత్ పునరుద్ధరించేలా చర్యలు తీసుకున్నారు. ఆయన వెంట జాదవ్ సుభాష్, జాదవ్ ప్రకాష్, వినయ్‌రెడ్డి, బాలాజి, వికాస్, రోహిదాస్, తదితరులున్నారు.

ఆదిలాబాద్‌లో పడిపోతున్న ఉష్ణోగ్రతలు

● నేరడిగొండలో 41.7 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత

ఆదిలాబాద్, మే 10(ఆంధ్రజ్యోతి): గత రెండు మూడు రోజులుగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో ఆదిలాబాద్ జిల్లాలో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. గత వారం రోజుల క్రితం 46.0 డిగ్రీల వరకు నమోదైన పగటి ఉష్ణోగ్రతలు ప్రస్తుతం 40 డిగ్రీలకు చేరుకున్నాయి. శుక్రవారం జిల్లా సగటు గరిష్ట ఉష్ణోగ్రత 40.3 డిగ్రీలు కాగా కనిష్టంగా 25.7 డిగ్రీలు నమోదయ్యాయి. అత్యధికంగా నేరడిగొండ మండలంలో 41.7, బేలలో 41.3, భీంపూర్‌లో 41.0, ఆదిలాబాద్‌అర్బన్‌లో 40.9, ఇంద్రవెల్లిలో 40.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం నుంచి భానుడి భగభగలు కనిపించిన మధ్యాహ్న సమయంలో ఇచ్చోడ, తాంసి, తలమడుగు మండలాల్లో తేలికపాటి వర్షాలు కురవడంతో వాతావరణం చల్లబడింది. పగలంతా తీవ్రమైన ఉక్కపోత కనిపిస్తున్న సాయంత్రం వేళల్లో ఈదురు గాలులతో కూడిన చిరుజల్లులు కురుస్తున్నాయి. మరో రెండు రోజుల పాటు జిల్లాలో అక్కడక్కడ తేలిక పాటి వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ నిపుణులు పేర్కొంటున్నారు. జిల్లాలో దాదాపుగా యాసంగి సీజన్ ముగిసి పోవడంతో అకాల వర్షాలకు పెద్దగా పంట నష్టం జరుగడం లేదు. అమ్మేందుకు సిద్ధంగా ఉంచిన జొన్నలు ఆరుబయటనే నిల్వ చేసుకోవడంతో అకాల వర్షాలకు రైతులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. పంట కుప్పల పై పాలథిన్ కవర్లను వేస్తూ కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు.

అణగారిన వర్గాలకు దారిచూపిన బసవేశ్వరుడు

● లింగాయత్ సమాజ్ అధ్యక్షుడు అశోక్ ముస్తాపూరే

ఆదిలాబాద్ అర్బన్, మే 10: అణగారిన వర్గాలకు 12వ దశాబ్దంలోనే దారి చూపిన మహనీయుడు మహాత్మ బసవేశ్వరుడని లింగాయత్ సమాజ్ అధ్యక్షుడు అశోక్ ముస్తాపూరే అన్నారు. శుక్రవారం మహాత్మ బసవేశ్వర జయంతిని వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బసవేశ్వర చౌక్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లింగాయత్ సమాజ్ అధ్యక్షుడు అశోక్ ముస్తాపూరే మాట్లాడుతూ అణగారిన వర్గాల కోసం అనేక సంస్కరణాలు చేసిన మహనీయుడు బసవేశ్వరుడని కొనియాడారు.పార్లమెంట్ స్థాపన,మహిళల రిజర్వేషన్ కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుంటు సమాజం సభ్యులు ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో జంగము సమాజ్ రాష్ట్ర కార్యదర్శి అన్నదానం జగదీశ్వర్, సభ్యులు వెండిభద్రేశ్వర్, శివకుమార్, విజయ్‌కుమార్, సోన్‌టకే ఆనంద్, సదాశివ్, గంగాధర్, సందీప్, బంగారి దేవన్న, తదితరులున్నారు.

● 'స్త్రీ, పురుష అసమానతలపై పోరాడిన మహనీయుడు'

బోథ్: సమాజంలో స్త్రీ, పురుషుల అసమానత బాల్య వివహాలు వర్ణ లింగ బేధాలపై పోరాటం చేసిన మహనీయుడు బసవేశ్వరుడని లింగాయత్ సంఘం నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మరలపెల్లి గ్రామంలో బసవేశ్వర జయంతి వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా మరల పెల్లి మాజీ సర్పంచ్ దేవేందర్ లింగాయత్ లింగ బలిజ కుల సంఘాల పెద్దలు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.


బోథ్‌లో జయంతి కార్యక్రమంలో పాల్గొన్న లింగాయత్ బలిజలు

- జిల్లాలో నేటితో ముగియనున్న లోక్‌సభ ఎన్నికల ప్రచారం
- ఓట్లను రాబట్టేందుకు నేతల పోటాపోటీ ప్రయత్నాలు
- గెలుపు ధీమాతో ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు
- ముంచుకొస్తున్న పోలింగ్.. అభ్యర్థుల్లో మొదలైన ఆందోళన

ఉరుకులు.. పరుగులు



ఆదిలాబాద్, మే 10(ఆంధ్రజ్యోతి): 2024 లోక్‌సభ ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రంతో ముగియనుంది. చివరి రోజు కావడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులందరు సుడిగాలి పర్యటనలు చేస్తూ ఉరుకులు పరుగులు పెడుతున్నారు. పార్టీల బహిరంగ ప్రచారానికి నేటితో తెరపడనుంది. దీంతో అన్ని రాజకీయ పార్టీలు ప్రచారంలో మరింత స్పీడును పెంచుతున్నాయి. పార్లమెంట్ పరిధిలో గత నెల 30 నుంచి పూర్తిస్థాయి ఎన్నికల ప్రచారం మొదలైంది. ఇప్పటికే అన్ని పార్టీల అగ్రనేతలు ప్రచారంలో పాల్గొన్నారు. మరికొన్ని గంటల సమయం మాత్రమే మిగిలి ఉండడంతో అభ్యర్థులకు అగ్ని పరీక్షగా మారింది. ఈసారి ఇంటింటా ప్రచారానికి దూరంగా ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థులు.. సభలు, సమావేశాలు, ర్యాలీలతో ప్రచార పర్వానికి పదును పెట్టారు. అయితే గతానికి భిన్నంగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీలు వినూత్న ప్రచారాన్ని చేపట్టాయి. సోషల్ మీడియా వేదికగా ఓటర్లకు దగ్గరయ్యేందుకు ముమ్మర ప్రయత్నాలు చేశాయి. మరికొన్ని గంటల్లోనే ప్రచార పర్వానికి తెరపడనుండడంతో ఇక ఒక్కక్షణం కూడా వృథా చేయకుండా నియోజకవర్గాలను చుట్టేస్తున్నారు. మొదటి నుంచి ప్రచారంలో కొంత ముందున్న బీజేపీని ఢీకొట్టేందుకు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇన్నాళ్లు మండలాల వారీగా ప్రచారాన్ని చేపట్టిన చివరి దశలో అభ్యర్థుల గెలుపోటములను నిర్ణయించే పట్టణ ఓటర్లను తమ వైపునకు తిప్పుకునేందుకు పోటాపోటీ ప్రయత్నాలు సాగుతున్నాయి. మొత్తానికి ప్రధాన పార్టీల అభ్యర్థులు గెలుపు ధీమాతోనే కనిపిస్తున్న లోలోన మాత్రం ఏదో తెలియని గుబులు వెంటాడుతున్నట్లు కనిపిస్తోంది.

తటస్థ ఓట్లపై గురి

అసమ్మతి, తటస్థ ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు ప్రధాన పార్టీలు ప్రత్యేక దృష్టిని సారిస్తున్నాయి. ఓటర్ల నాడి పట్టి ఎన్నికల్లో పైచేయి సాధించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రత్యర్థి పార్టీల ఎత్తులను చిత్తుచేస్తు గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారు. ఇన్నాళ్లు సాదాసీదాగా సాగిన చివరి సమయంలో ఓటర్ల నాడి పట్టేందుకు అభ్యర్థులు పోటాపోటీ ప్రయత్నాలు చేస్తున్నారు. తమ ప్రచారం ప్రజల్లోకి ఏ మేరకు వెళ్లిందో? తెలుసుకునే పనిలో పడ్డారు. నియోజక వర్గాల వారీగా పరిస్థితిపై ఆరా తీస్తున్నారు. ఏ పార్టీతో సంబంధం లేని తటస్థ ఓటర్లకు దగ్గరయ్యే ప్రయత్నాలు చేస్తున్నారు. సామాజిక వర్గాల వారీగా గంపగుత్తగా ఓట్లను రాబట్టేందుకు ఎత్తుగడలు వేస్తున్నారు. పగలంతా ప్రచారం చేస్తున్నా.. రాత్రుళ్లు వ్యూహాలకు పదును పెడుతు న్నారు. అన్నిరకాల ప్రలోభాలతో పాటు కీలక నేతలతో రహస్య మంత నాలు జరుపుతున్నారు. భారీగా హామీలను గుప్పిస్తూ ఓటర్ల మద్దతును కూడగడుతున్నారు.

దూకుడు పెంచిన పార్టీలు

గత కొద్దిరోజులుగా ముమ్మర ప్రచారాన్ని చేపట్టిన అభ్యర్థులు తుదిదశ ప్రచారంతో మరింత దూకుడును పెంచారు. శనివారం సాయంత్రంతో బహిరంగ ప్రచారానికి గడువు ముగియనుంది. కీలక సమయాన్ని వృథా చేయకుండా రోడ్ షోలతో పాటు భారీ బైక్ ర్యాలీలను నిర్వహించేందుకు ప్లాన్ చేస్తున్నారు. పార్టీ క్యాడర్‌లో జోష్ నిచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. సామాజిక మాధ్యమాలతో పాటు కార్యకర్తల ద్వారా ఎక్కడికక్కడే ప్రచారం జరిగేలా జాగ్రత్త పడుతున్నారు. సాధ్యమైనంత వరకు ప్రచార రథాలతో ప్రచారం హోరెత్తేలా చూస్తున్నారు. ఇన్నాళ్లు చేసిన ప్రచారంలో మిగిలి పోయిన నియోజకవర్గాల్లో వేగంగా ప్రచారం చేస్తూ ఒకవేళ వీలు పడకుంటే తమ కుటుంబ సభ్యులు, ఎమ్మెల్యేలతో ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. ఓటర్లపై అధిక ప్రభావాన్ని చూపే స్టార్ కాంపెయినింగ్ లేకపోయినా.. అభ్యర్థులే సర్వశక్తులను ఒడ్డుతున్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఎమ్మెల్యేలు, ఇతర వీఐపీల ప్రచారం కలిసి వస్తున్నా.. బీఆర్‌ఎస్ మాత్రం సొంత క్యాడర్‌నే నమ్ముకుంటుంది.

అభ్యర్థుల్లో మొదలైన టెన్షన్

శనివారం సాయంత్రంతో ఎన్నికల ప్రచారానికి తెరపడనుంది. ఇక ఎన్నికల పోలింగ్‌కు సమయం దగ్గర పడుతుంది. 13న లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌ను నిర్వహించేందుకు దాదాపుగా అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. ఓటర్లు తమ ఓటు ద్వారా తీర్పునిచ్చే సమయం దగ్గర పడుతుంది. మరో 48 గంటల్లోనే పోలింగ్ ఘట్టం కూడా ముగిసిపోనుంది. ఓటర్లు ఎవరి వైపు మద్దతుగా నిలుస్తారోనన్న ఉత్కంఠ సర్వత్రా కనిపిస్తుంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఇస్తున్న హామీలు, వరాలు ఏ మేరకు ప్రభావాన్ని చూపుతాయో? వేచి చూడాల్సి ఉంది. అభివృద్ధికి పట్టం కడుతారో? లేక అభ్యర్థుల మార్పును కోరుకుంటారో? మే 13న జరిగే పోలింగ్ సరళితో తేలిపోనుంది. పోలింగ్‌కు సమయం దగ్గర పడుతున్న కొద్ది అభ్యర్థుల్లో టెన్షన్ కనిపిస్తుంది. ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో గెలిచేదెవరన్నదే ప్రధాన చర్చనీయాంశంగా మారింది. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగుతుందా? లేక మరోసారి బీజేపీ పార్టీకే పట్టం కడుతారా? కష్ట కాలంలో కారు పార్టీకి అండగా నిలుస్తారా? అనేది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇక బహిరంగ ప్రచారానికి సమయం దగ్గర పడడంతో అభ్యర్థులంతా అంతర్గతం గా ఓటర్ల మద్దతును కూడగట్టే ప్రయత్నాలు చేస్తున్నారు.





13 వరకు జొన్న పంట కొనుగోళ్ల నిలిపివేత

బోథ్, మే 10: బోథ్ మార్కెట్ కమిటీ పరిధిలో జొన్న పంట కొనుగోళ్లను ఈనెల 13వ తేదీ వరకు నిలిపివేస్తున్నట్లు బోథ్ సహకార సంఘం సీఈవో గోలి స్వామి తెలిపారు. రైతులు తిరిగి 14వ తేదీన పంటను మార్కెట్‌కు తీసుకురావాలని పేర్కొన్నారు. కాగా, కొందరు రైతులు విషయం తెలియక రావడంతో వాహనాల బయట నిలిపివేశారు. దీంతో డైరెక్టర్ రాజు యాదవ్ సీఈవోతో మాట్లాడి వాహనాలనులో పలికి పంపించే ఏర్పాటు చేశారు.

పోలింగ్ రోజున

పొరపాట్లకు తావులేకుండా చూడాలి

- రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజార్షిషా



ఆదిలాబాద్ అర్బన్, మే 10: పోలింగ్ రోజు ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా, అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేందుకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని ఎన్నికల సిబ్బందిని రిటర్నింగ్ అధికారి రాజార్షిషా ఆదేశించారు. శుక్రవారం పోలింగ్ రోజు ఎన్నికల విధులను నిర్వహించే సిబ్బందితో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. 48 గంటల సైలెన్స్ పీరియడ్‌లో నార్నూర్, గాదగూడలో రేపు సాయంత్రం 4గంటల నుంచి సైలెన్స్ పీరియడ్ మొదలవుతుందని, మిగిత జిల్లాలో సాయంత్రం 6గంటలకు సైలెన్స్ పీరియడ్ మొదలవుతుందన్నారు. 13వ తేదీ ఎన్నికలు పూర్తయ్యేంత వరకు ఈ సైలెన్స్ పీరియడ్ అమల్లో ఉంటుందని ఎంపీడీవోలు, ఎంపీవోస్, సెక్టార్ ఆఫీసర్, ఏఆర్వోస్, పంచాయతీ సెక్రెటరీలు, మున్సిపల్ కమిషనర్లు తీసుకునే చర్యలు ఈ సైలెన్స్ పీరియడ్‌లో ఎటువంటి క్యాంపెయిన్ జరగడానికి వీలు లేదన్నారు. పార్టీ సమావేశం, ర్యాలీ, ప్రచారం గాని ఏమి జరగడానికి వీలు లేదని, 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ఐదుగురు కంటే ఎక్కువమంది సమూహంగా ప్రచారం చేయకూడదని, ఒకవేళ జరిగితే పంచాయతీ సెక్రటరీలు, ఎంపీడీవోలు, తహసీల్దార్‌లు వెంటనే స్పందించి ఈసీఐ ఆదేశాల మేరకు చర్యలు తీసుకోవడం, ప్రచారం జరుగకుండా ఆపాలన్నారు. ఈ సైలెన్స్ పీరియడ్‌లో లౌడ్‌స్పీకర్లు ఉపయోగించడం, ఫ్లెక్సీలు బ్యానర్లు పెట్టడం నిషేధం అన్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి చెందిన ఓటర్ మాత్రమే ఈ నియోజకవర్గంలో ఉండాలని, ఈ పార్లమెంట్ నియోజకవర్గం ఓటర్ కానట్లయితే సంబంధిత అధికారులు అటువంటి వారిని గుర్తించాలని సూచించారు. పంచాయతీ సెక్రెటరీలు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు మీ పరిధిలో ఉన్న గెస్ట్ హౌజ్, ఫంక్షన్ హాల్స్, సమూహామయ్యే ప్రదేశాలను తనిఖీ చేస్తూ వేరే పార్లమెంట్ నియోజకవర్గం సంబంధించిన వ్యక్తులు ఉన్నారా? ఐదుగురు కంటే ఎక్కువ సమూహమయ్యారా?, డబ్బుల పంపకం కాని, భోజనాలు పెట్టడం కానీ చేస్తే ఎఫ్‌ఎస్‌టీ ద్వారా తగు చర్యలు తీసుకోవాలన్నారు. బల్క్ ఎస్‌ఎంఎస్‌కి సంబంధించి ఈ 48 గంటల సైలెన్స్ పీరియడ్‌లో నిషేదం ఉంటుందని, ఒకవేళ ఇలా జరిగితే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని ఆయన పేర్కొన్నారు.

● 13 రకాల కార్డులలో ఏదైనా..

ఆదిలాబాద్ అర్బన్: ఈనెల 13న పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలకు వెళ్లేటప్పుడు 13రకాల కార్డులలో ఏదైనా ఒకటి తమ వెంట తీసుకెళ్లాలని రిటర్నింగ్ అధికారి రాజార్షిషా తెలిపారు. ఓటర్‌కార్డు, ఆధార్‌కార్డు, ఎంఎన్‌ఆర్‌ఈజీఏ జాబ్‌కార్డు, ఫొటోతో ఉన్న పోస్టుఆఫీస్ పాస్‌బుక్, కార్మిక మంత్రిత్వ శాఖ ఇచ్చిన హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, లేబర్ గుర్తింపుకార్డు, ఇండియన్ పాస్‌పోర్టు, ఫొటోతో ఉన్న పెన్షన్ డాక్యుమెంట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ గుర్తింపుకార్డు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ఇచ్చిన అధికారిక గుర్తింపుకార్డు, దివ్యాంగుల గుర్తింపు కార్డులలో ఏదైనా ఒకటి తమ వెంట పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లాలని ఎన్నికల అధికారి పేర్కొన్నారు.

● 13న వేతనంతో కూడిన సెలవు

ఆదిలాబాద్ అర్బన్: ఈనెల 13న పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ జరుగనున్న నేపథ్యంలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రభుత్వం వేతనంతో కూడిన సెలవు ప్రకటించిందని ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి,కలెక్టర్ రాజార్షిషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం పోలింగ్ సందర్భంగా అన్ని ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలకు, పరిశ్రమ లకు వేతనంతో కూడిన సెలవు దినంగా ప్రకటించారన్నారు.ఓటర్లు ఈ సెలవు రోజున తమ ఓటు హక్కును వినియోగించాలని ఆయన తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్‌లో 83 శాతం పోలింగ్

ఉట్నూర్, మే 10: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఖానాపూర్ నియోజకవర్గంలో ఎన్నికల విధులకు హాజరుకానున్న ఉద్యోగులు ఉపయోగించుకునే పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ 83శాతం అయినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. రెండు రోజుల క్రితం వరకు పోలింగ్ తేదీ ముగిసినప్పటికీ ప్రభుత్వం మరో రెండు రోజులు అవకాశం కల్పించడంతో శుక్రవారం గడువు పూరైంది. నియోజకవర్గంలో 2,24,523 మంది ఓటర్లు ఉండగా.. 2025మంది ఎన్నికల విధులకు హాజరవుతున్న ఉద్యోగులున్నారు. జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ప్రతీ ఉద్యోగి తమ ఓటు హక్కును వందశాతం ఉపయోగించుకోవాలని ఆదేశించినప్పటికీ నియోజకవర్గంలోని ఉద్యోగుల కోసం ఉట్నూర్‌లోని సహాయ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో పోస్టల్‌బ్యాలెట్‌ను ఏర్పాటు చేశారు. శుక్రవారం గడువు ముగియడంతో 1680 మంది ఉద్యోగులు మాత్రమే తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోగా.. 345మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌కు దూరంగా ఉన్నారు.


పోస్టల్ బ్యాలెట్ కోసం క్యూలో ఉన్న ఉద్యోగులు

ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి : తహసీల్దార్

తాంసి, మే 10: మండలంలోని ఆయా గ్రామాలలో ఉన్న ఓటర్లందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ లక్ష్మి కోరారు. శుక్రవారం మండలంలోని అట్నంగూడ, జామిడి, గిరిగావు, బండల నాగపూర్, సావర్గా గ్రామాలలో ఆమె ప్రజలతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటు తమ హక్కుగా భావించాలని సూచించారు. ఎవరికి ఓటు వేశామన్న విషయం ముఖ్యం కాదని, ఓటు వేశాము అనే విషయంపై స్పందించాలని అన్నారు. ఇష్టం వచ్చిన వారికి ఓటు వేసుకోవాలని తహసీల్దార్ సూచించారు. పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు కావాల్సిన సౌకర్యాలను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. విధుల విషయాల్లో నిర్లక్ష్యం చేసే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతీఓటరును మర్యాద పూర్వకంగా స్వాగతించాలని సూచించారు.

'ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం'

గుడిహత్నూర్, మే 10: మండల కేంద్రంలో మోడల్ స్కూల్ కళాశాలలో పదవ తరగతి పాసైన విద్యార్థులు ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కే శివాజీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ కోర్సులు ఖాళీగా ఉన్నాయన్నారు. పదవ తరగతి పాసైన విద్యార్థులు ఈ నెల 31వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకావం ఉందన్నారు. మరిన్ని వివరాలకు టీఎస్ మోడల్ స్కూల్ వైబ్ సెట్ చూడాలని పేర్కొన్నారు.

